క్లుప్తంగా

రేపు అయ్యప్పకు ప్రత్యేక పూజలు


సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి

పెందుర్తి: అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం సుజాతనగర్ లోని పూర్ణ పుష్కళ సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరాట్టు ఉత్సవం చేస్తామని పేర్కొన్నారు. భక్తులంతా పూజల్లో పాల్గొనాలని కోరారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు


పూజలందుకున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: స్థానిక సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ శర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేపట్టారు.

వైభవంగా నిత్యకల్యాణం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


వెంకటాద్రిపై తులాభారం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా 13వ రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ నిర్వహించారు. ముందుగా మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసూక్త పారాయణం, కుంకుమ పూజలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

కంటి పరీక్షల్లో ఆప్టోమెట్రీ సేవలు కీలకం


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్

సింహాచలం: కంటి పరీక్షల్లో ఆప్టోమెట్రీ సేవలు ఎంతో కీలకమని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి స్కూల్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ అన్నారు. నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో శనివారం ప్రపంచ ఆప్టోమెట్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కంటి పరీక్షల్లో ఆప్టోమెట్రీ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రొఫెసర్ కృష్ణప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి విజయ్‌కుమార్, కృష్ణకుమార్, డీజీఎం కె.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


వాలిమెరకలో రైతు భరోసా కేంద్రం


రైతు భరోసా కేంద్రం లోపలి భాగం

అన్నదాతకు దన్ను

- రైతు భరోసా కేంద్రాల నిర్మాణం
- ఆర్బీకేల ద్వారా రైతులకు విస్తృత లబ్ధి

పెందుర్తి: అన్నం పెట్టే రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రతి దశలో అన్నదాతకు చేయూతనిచ్చింది. వ్యవసాయాన్ని పండగలా మార్చింది. ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆర్‌బీకేల ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించింది. వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేసింది. దుక్కు నుంచి నూర్పు వరకు ప్రతీ దశలోనూ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడంతో పండగ వాతావరణంలో రైతులు సేద్యం చేస్తున్నారు.

సేవలన్నీ రైతు చెంతకే..

సీజన్‌లో పంట వేసేందుకు పెట్టుబడి సాయం మొదలుకుని పంట చేతికందిన తర్వాత రైతుకు గిట్టుబాటు ధర అందించే వరకు అన్నదాతను వెన్నంటి ప్రోత్సహిస్తోంది. నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాల నుంచి


రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్న యంత్రాలు

నాలుగు విడతల్లో 22570 మంది రైతులకు దాదాపు రూ.90 కోట్లు వారి ఖాతాల్లోకే జమ చేసింది. సబ్బవరం మండలం అమృతపురంలో పైలట్ ప్రాజెక్ట్‌గా రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేసి వారికి కావాల్సిన పనిముట్లు అందిస్తోంది. రైతులకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారు. పంట బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు చేసింది. వ్యవసాయానికి పగటిపూట 9 ఉచితంగా విద్యుత్ అమలు చేస్తోంది.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు

ఆర్బీకేల ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే రూ.13,500తో పాటు అర్హత కలిగిన ప్రతీ రైతుకు ఏటా రూ. లక్ష వరకు అందిస్తోంది.

అను'బంధం'

నియోజకవర్గంలో మొత్తం 38(పెందుర్తి 9, పరవాడ 12, సబ్బవరం 17) రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో భవనానికి సుమారు రూ.23.94 లక్షల(నియోజకవర్గం మొత్తం ఆర్‌బీకేలకు రూ.9.10 కోట్లు) చొప్పున నిధులు కేటాయించింది. వీటికి అదనంగా వ్యవసాయ అనుబంధ కమిటీలు, సంఘాలకు ప్రభుత్వం పునర్జీవం పోసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఆయా సంఘాల ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. ప్రభుత్వం తమకు అండగా నిలవడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ముగ్గురి అమ్మవార్ల పండగలు


పైడిమాంబ అమ్మవారు


ముత్యమాంబ అమ్మవారు


పోలమాంబ అమ్మవారు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి ముత్యాలమ్మతల్లి, పరవాడ పైడిమాంబ, తానాం పరదేశిమాంబ, దేశపాత్రునిపాలెం గ్రామంలో పోలమాంబ అమ్మవార్ల పండగలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు పండగలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ముత్యమాంబ అమ్మవారి పండగను వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాల ప్రజలు చేసుకుంటారు. ఆలయాలను రంగు రంగుల విద్యుత్ తోరణాలు, పూలతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. పుర వీధులను విద్యుత్ తోరణాలతో అలంకరించారు. ఆయా గ్రామాల్లో పలు సాంస్కృతి కార్యక్రమాలతో పాటు తప్పెటగుళ్లు, చిడతలు, నేల డ్యాన్సులు, భజనలు, సాముగరిడీలు, మహిళా కోలాటాలను నిర్వహిస్తారు. ఈ నెల 26న పరవాడ, వాడచీపురుపల్లి, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామాల అమ్మవార్ల అనుపోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. సీఐ ఎస్.బాలసూర్యారావు ముందస్తు చర్యలు చేపట్టారు. పండగల్లో లాటరీ, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ హెచ్చరించారు.

ఘనంగా పండిత సదస్సు


సదస్సు నిర్వహిస్తున్న వేదపండితులు

సింహాచలం: సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం పండిత సదస్సు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం వేద పండితులు స్వామివారి వైభవాన్ని కీర్తించారు. అర్చకులు పూజలు నిర్వహించారు. సదస్సులో వేద పండితులు రామాయణం జగన్మోహన్‌శర్మ, ముక్కామల సుబ్రహ్మణ్యశర్మ, ఎం.లలిత్‌కుమార్‌శర్మ, మధుర సోమయాజులశర్మ, కిరణ్ కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంపై జనసైనికుల కన్ను

- చింతగట్లలో ఆక్రమించిన జనసేన కార్యకర్త
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ వెంకటలక్ష్మి


చింతగట్లలో జనసేన కార్యకర్తల ఆక్రమణలో ఉన్న మండల పరిషత్ పాఠశాల స్థలం

పెందుర్తి: మండలంలోని చింతగట్లలో మండల పరిషత్ పాఠశాలకు చెందిన స్థలంపై స్థానిక జనసైనికుల కన్ను పడింది. సర్వే నెంబర్ 73లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు స్థానిక జనసేన నాయకులు మాడిస రాజు, మాడిస హరీష్ స్కెచ్ వేశారు. ఇప్పటికే చాలా వరకు ఈ స్థలంలో చొరబడ్డారు. దీనిపై స్థానిక సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.

మండల పరిషత్ అధికారుల నిర్లక్ష్యం

వాస్తవానికి చింతగట్లలోని సర్వే నెంబర్ 73లో మండల పరిషత్ పాఠశాల 40 ఏళ్లుగా ఉంది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం మరో స్థలంలో నూతన భవనం నిర్మించింది. కాగా పాత పాఠశాల స్థలానికి రక్షణ కల్పించాల్సిన మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఆ స్థలంపై జనసేన కార్యకర్తల కన్ను పడింది. పశువుల పెంపకం పేరుతో ఆ స్థలంలో పాగా వేశారు. ఈ కబ్జా వ్యవహారంపై చింతగట్ల సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంకా కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మా దృష్టికి వచ్చింది

సర్వే నెంబర్ 73లోని స్థలం ఆక్రమణకు గురైనట్లు మాకు ఫిర్యాదులు వచ్చాయి. అది మండల పరిషత్ స్థలం కావడంతో వారికి సమాచారం ఇచ్చాం. మండల పరిషత్ ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం.

– గోవిందరావు, వీఆర్వో

సమగ్రంగా దూర విద్య కోర్సుల రూపకల్పన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రంలో అందించే కోర్సుల రూపకల్పన నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి తెలిపారు. శనివారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూరవిద్యలో సంస్కరణలు అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సరైన దిశలో చేసే సంస్కరణలు భవిష్యత్తులో మంచి ఫలితాలు అందిస్తాయన్నారు. విద్యా రంగంలో పని చేస్తున్న వారంతా సేవా దృక్పథంతో నడుచుకోవాలని సూచించారు. దూరవిద్యలో చదివే విద్యార్థులకు సైతం రానున్న కాలంలో ప్లేస్‌మెంట్స్ కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పరీక్షల్లో ఓఎంఆర్ జవాబు పత్రాలను ప్రవేశ పెడుతున్నామన్నారు. అన్ని సేవలకు ఆన్‌లైన్లో చెల్లింపులు జరిపే సదుపాయం కల్పించామన్నారు. దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ జయరామ్ రచించిన బీఈడీ పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు.

24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు


పెందుర్తిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం


పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల కోసం పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌తో పాటు 24 గంటలు అందుబాటులో ఉండే కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శేష శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులు, సందేహాలు, ఇతర అంశాల గురించి తెలుసుకునేందుకు 90637 83289, 0891-2954161 నంబర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో


విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

పెందుర్తి: చినముషిడివాడలోని కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో శనివారం జరిగిన సైన్స్ ఎక్స్‌పో, ఆర్ట్, క్రాఫ్ట్ ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు సైన్స్, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఉత్తమ ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను పాఠశాల డీన్ కె.శేషుబాబు, ప్రిన్సిపాల్ బి.భాగ్యలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాజు (ఫైల్)

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని గంగిరెడ్లకాలనీ వద్ద ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం వేకువ జామున మృతి చెందాడు. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాలు. సబ్బవరం శివారు గంగిరెడ్లకాలనీకి చెందిన దనకొండ రాజు(31) ఈ నెల 21న చోడవరం రోడ్డులోని టీ పాయింట్‌లో టీ తాగి రోడ్డు దాటి ఇంటి కి వెళ్తుండగా చోడవరం వైపు నుంచి సబ్బవరం వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో రాజు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.అయితే పరిస్థితి విషమించడంతో శనివారం వేకువజామున రాజు మృతి చెందాడని అతని భార్య శాంతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. భార్య శాంతితో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆ కుటుంబాన్ని ఓదార్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

మద్యం సీసాలతో ఇద్దరు అరెస్ట్

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, లంకెలపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు అక్రమంగా మద్యం తరలిస్తుండగా శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సూరాడ కృష్ణమ్మ వైన్ షాపులో 5 సీసాలు కొనుగోలు చేసి తరలిస్తుండగా.. లంకెలపాలెం గ్రామానికి చెందిన షేక్ రాము నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ–జనసేన కార్యకర్తలు


పార్టీలో చేరిన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


సుజాతనగర్‌లో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మెంటి మహేష్

పెందుర్తి: వేపగుంట సమీపంలోని బంటా కాలనీలో టీడీపీ–జనసేనకు షాక్ తగిలింది. స్థానిక నేత కడారి శ్రీనివాస్ సహా 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీ నేతలు బెహరా భాస్కరరావు, గండి రవికుమార్, యతిరాజుల నాగేశ్వరరావు, ఆదిరెడ్డి మురళి, దాసరి సత్తిబాబు, రామరాజు, బల్ల రాంబాబు, జగదీష్, శంకర్, వినోద్, సంపత్‌వర్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

97వ వార్డులో: వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మెంటి మహేష్ ఆధ్వర్యంలో గిరిప్రసాద్ నగర్‌కు చెందిన 100 మంది జనసేన,టీడీపీ కార్యకర్తలు అదీప్‌రాజ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఈ సందర్భంగా చెప్పారు.

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిద్దాం


ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

- మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేద్దాం
- ముఖ్య నేతల సమావేశంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: కుల,మత, ప్రాంత, రాజకీయ పార్టీల బేధం లేకుండా ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో అమలు చేశారన్న విషయం మరోసారి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలతో అదీప్‌రాజ్ సమావేశం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి మద్దతు కోరాలన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి పెందుర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. ప్రణాళికా బద్ధంగా పని చేద్దామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, పైలా శ్రీనివాసరావు, గండి రవికుమార్, ముమ్మన దేముడు, బోకం రామునాయుడు, బట్టు సూర్యకుమారి, కోన రామారావు, గొరపల్లి శ్రీను, పాలిశెట్టి సురేష్, కొటాన రాము, ఆదిరెడ్డి మురళి, కోడిగుడ్ల దేవిసాంబ, దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, యతిరాజుల నాగేశ్వరరావు, మెంటి మహేష్, దాడి ఉమామహేశ్వరరావు, గొర్లె రామునాయుడు, శరగడం నరసింహమూర్తి, దొగ్గ గౌతం, బంధం నాగేశ్వరరావు, ఇల్లపు ప్రసాద్, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, పూర్ణ, మద్ది శ్రీనివాస్, రామరాజు, రాపేటి రాము, వద్దాది అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


పరవాడ బాలికల పాఠశాలలో..

పరవాడ: దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్పవ్యక్తి విప్లవవీరుడు సర్దార్ భగత్ సింగ్ అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భగత్‌సింగ్ 93 వర్ధంతి సందర్భంగా పరవాడ సంతబయలు వద్ద శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. కుల మతాల మధ్య చిచ్చురేపుతున్న బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

➡ ఐద్వా ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని పరవాడ బాలికల పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం, పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు సమాజ సేవకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శోభ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.